క్లుప్తంగా

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ నర్సింహమూర్తి

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని, ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న ట్యాబ్‌లతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని గణపవరం మండలం వరదరాజపురం సర్పంచ్ కోడేటినర్సింహమూర్తి అన్నారు. బుధవారం గ్రామంలోని యూపీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. బైజూస్ సంస్థ పాఠాలను విద్యార్థులు నేర్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యాకమిటీ సభ్యులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం భోగాపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, పేకాట ఆడుతున్న నలుగురినిరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,180 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

జాబ్‌మేళాలో 16 మంది ఎంపిక



క్యాంపస్ ఎంపికలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపల్ అధ్యాపకులు

గణపవరం: గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో 16 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పాకలపాటి నిర్మలకుమారి తెలిపారు. వీరిలో 11 మంది గణపవరం డిగ్రీ కాలేజి విద్యార్థులు కాగా, ఐదుగురు ఇతర కాలేజీలకు చెందినవారని అన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు, జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. 16 మంది అభ్యర్థులు ఐసీఐసీఐ బ్యాంకులో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ పి.మధురాజు, ఐసీఐసీఐ హెచ్‌ఆర్ ఆర్.కన్నయ్య, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న కుమార్

దెందులూరు: అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు అన్నారు. బుధవారం గోపన్నపాలెం పీఈటీ కళాశాల గ్రౌండ్‌లో ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాల మేరకు సంక్రాంతి క్రీడా క్రికెట్ పోటీలను ఎస్సై ప్రారంభించారు. నిర్వాహకులు జీ. చందు మాట్లాడుతూ 7 రోజులు పాటు ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. బుధవారం నాలుగు జట్ల మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ పాల్గొన్నారు.

కుటుంబ అభ్యున్నతికి స్త్రీ విద్య అవసరం



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఆళ్ల సతీష్ చౌదరి

పెదపాడు: సమాజంలో కుటుంబ అభ్యున్నతికి స్త్రీ విద్య ఎంతో అవసరమని జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సతీష్ చేతుల మీదుగా అందించారు. ఈకార్యక్రమంలో వట్లూరు గ్రామ సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి స్థానిక నాయకులు గుజ్జుల నవీన్ పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ రూన్సీరాణి పాల్గొన్నారు.

జూదరుల బైండోవర్

ఉంగుటూరు: కోడిపందేలు, జూదం, గుండాట నిర్వహించే వందమందిని గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేసినట్టు చేబ్రోలు ఎస్సై స్వామి తెలిపారు. వారిపి తహసీల్దారు ముందు హాజరుపర్చామని సొంతపూచీ కత్తుపై తిరిగి విడుదల చేశామని తెలిపారు. కోడిపందేలు, గుండాట పేకాట నిర్వాహకులపై బైండోవర్ నమోదు చేశామని ఎస్సై వివరించారు.

అర్హులందరికీ వైఎస్సార్ పింఛను కానుక



లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



దెందులూరు కోఆపరేటివ్ సొసైటీలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

- పింఛను కోసం సిఫార్సులు అవసరం లేదు
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- పండగలా కొత్త పింఛన్ల పంపిణీ

నిడమర్రు: ప్రతి నెల 1వ తేదీనే మన ఇంటి ముందుకు వచ్చి తలుపు తట్టి మీకు పెన్షన్ అందించే వ్యవస్థను రూపొందించిన దార్శనికుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో భాగంగా బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నిడమర్రు మండలంలో కొత్తగా మంజూరైన 216మంది లబ్ధిదారులకు సంబంధిత పెన్షన్ నగదును రూ.6.5 లక్షలు నగదు ఎమ్మెల్యే అందించారు. దీంతో మండలంలో మొత్తం 6,423 లబ్ధిదారులు ఉండగా రూ.1.75కోట్లు ప్రతి నెల పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే వాసుబాబు తెలిపారు. సామాజిక భద్రతలో భాగంగా దేశంలో రూ.2,750 నుంచి రూ.10వేల వరకూ అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ప్రతి నెలా 64 లక్షల మందికి రూ.1,765 కోట్లు పెన్షన్ రూపంలో పేదలకు అందిస్తున్న రికార్డు సైతం మన రాష్ట్రకే దక్కుతుందన్నారు. ఏటా పెన్షన్ నగదు పెంచుతామన్న హామీ మేరకు ఈనెల నుంచి అవ్వా, తాతలకు రూ.2,750 పెన్షన్ నగదు అందించి నిలబెట్టుకున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ వారోత్సవాలను ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 1,236 మందికి లబ్ధిదారులను గుర్తించామన్నారు. దరఖాస్తు చేసుకుంటే అర్హులందరికీ పెన్షన్ అందిస్తున్నామన్నారు. ముందుగా లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. పండుగ వాతావరణంలో లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే వాసుబాబు కేక్ కట్ చేసారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వేంద్ర వెంకటస్వామి, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, 16 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 37,500 పెన్షన్లు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో 37,500 పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అధ్యక్షతన దెందులూరు మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌దారుల పంపిణీ వారోత్సవాల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. నూతన పెన్షన్లను 295 మంది లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం దెందులూరు నియోజకవర్గంలో 31 వేల మందికి మాత్రమే పెన్షన్లను అందించిందన్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 38 లక్షలు పెన్షన్లు అందిస్తే ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద,బడుగు, బలహీన వర్గాల ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. గతంలో పెన్షన్ల కోసం అవస్థలు పడాల్సి వచ్చేందని, కార్యాలయం చుట్టూ తిరుగుతూ పెన్షన్‌దారులందరూ నరకం చవిచూసేవారన్నారు. జగనన్న నియమించిన వలంటీర్లు ఉదయం 5 గంటలకే ఇంటింటికీ వెళ్లి పెన్షన్ నగదును అందజేస్తున్నారని అన్నారు. ఇదే సొసైటీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దెందులూరు గ్రామానికి చెందిన భారతమ్మను పెన్షన్ విషయంలో అవమానించిన సంగతి ప్రజలు మర్చిపోలేదని అన్నారు. మూడున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తుంటే టీడీపీ, ఎల్లోమీడియా వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నాయన్నారు. 'దుగ్గిరాలలోనైనా, మరెక్కడైనా అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమంటూ' ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి బహిరంగంగా సవాలు విసిరారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాల పంపిణీలో భాగంగా దెందులూరు నియోజకవర్గానికి రానున్నారని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ప్రాంతం విద్యార్థులకు ఉన్నత చదువు అందుబాటులోకి తెచ్చేందుకు దెందులూరులో జూనియర్ కళాశాల మంజూరు చేయించి, తరగతులు ప్రారంభించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో నియోజకవర్గంలో మరిన్ని జూనియర్ కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు. 8వ తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యాబోధన అందించేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేసి విద్య పట్ల తనకున్న మక్కువను సీఎం జగన్ తెలియచేశారన్నారు. ప్రజల ఆశీస్సులతో మరో 30 ఏళ్ల పాటు రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటారన్నారు.

రోడ్లపై సభల రద్దు జీవో స్వాగతిస్తున్నాం

రాష్ట్రంలో బహిరంగంగా రోడ్లపై సభలు, సమావేశాలు, ర్యాలీలు నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను స్వాగతిస్తున్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఈ జీవో అన్ని పార్టీలకు వర్తిస్తుందని, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. లోకేష్, పవన్‌కల్యాణ్, చంద్రబాబు రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలిసినా, విడివిడిగా వచ్చినా విజయం సాధించేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ పార్టీయేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైస్ ఎంపీపీలు వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, పార్టీ జిల్లా నియోజకవర్గ నాయకులు యలమర్తి రామకృష్ణ, తొత్తడి వేదకుమారి, చల్లా మేరీ రాజు, కట్టా ఏసుబాబు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, త్రిమెన్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు , సచివాలయ కన్వీనర్లు ఉన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: పిల్లలకు నిర్దేశించిన సమయంలో టీకాలు తప్పకుండా వేయించాలని, టీకాలు పిల్లల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి అన్నారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ మొదటి డోసు వేశారు. దీనితోపాటు ఐపీవీ-3 డోసు టీకాలు కూడా వేసినట్లు తెలిపారు. సాధారణ వ్యాక్సిన్ తోపాటు ఇంజక్టబుల్ పోలియో వ్యాక్సిన్ ప్రతి నెలా మూడో డోసుగా ఇస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలని కోరారు. అనంతరం గణపవరం-4 గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 40 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో విల్సన్, పీహెచ్‌ఎన్ జి.వరలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు యోహాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా పురోగతిపై సమీక్ష

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం తల్లిదండ్రుల అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో విద్యార్థుల పురోగతిపై చర్చించారు. మార్చిలో నిర్వహించనున్న పబ్లిక్ పరీక్షలు, ఏప్రిల్, మేనెలలో నిర్వహించనున్న ప్రాక్టికల్స్, కళాశాలలో నిర్వహించే నాడు-నేడు పనులు తదితర అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో అధ్యాపకులు ఎం.పేర్రాజు, సీహెచ్‌వీవీ రామచంద్రరావు, పి.వెంకటేశ్వరరావు తదితరులు కళాశాలలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎరుకునాయుడు, జోత్స్నదేవి, సౌజన్య, హేమ, దుర్గయ్య, శ్రీకాంత్, రమేష్, అధ్యాపకేతర సిబ్బంది సునీల్‌కుమారి, కృష్ణమూర్తి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయం

- ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



పూళ్లలో వృద్ధురాలికి పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసి ప్రతి ఇంటా సంక్షేమ కాంతులను నింపారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్లలో సచివాలయం -1 పరిధిలో 110వ రోజైన బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు అడుగడుగునా వైసీపీ శ్రేణులు, నాయకులు, మహిళలు నీరాజనాలు పలికారు. అభిమానంతో ఆయనకు మహిళలు హారతులు పట్టారు. మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి బ్రోచర్‌లను అందించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛను సొమ్మును రూ.2,750 అందిస్తున్నారని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందిస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్విదించాలని, దీవెనలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు గొండు కృష్ణ చైతన్య, బొల్లారపు జ్ఞానరమ్య పవన్, గంటా శ్రీనివాసరావు, పొల్నాటి శ్రీను, ఆజామ్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకట కృష్ణారావు,కోడూరుపాడు, దుద్దేపూడి సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ పచ్చా బాబి, గుండుగొలను సొసైటీ అధ్యక్షుడు వగ్వాల భాస్కర్, నాయకులు రావిపాటి గాంధీ, గుడివాడ సీతారామాంజనేయులు, ఏవూరి రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వం

భీమడోలు: ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడమే మానవత్వమని, ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. పూళ్లలో బుధవారం మండల మానవత ఆధ్వర్యంలో పలువురికి ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జి.గణేష్‌కు రూ.5వేలు, నిరుపేద వృద్ధ దంపతులు డోకల చిన్నయ్య, లక్ష్మమ్మకు, పక్షవాతంతో బాధపడుతున్న గాదాపు చెంచమ్మలకు బియ్యం, నిత్యావసర సరుకులను ఉచితంగా అందించారు. వారికి భీమడోలుకు చెందిన వైసీపీ నేత, సాయిరామ్ క్లాత్ యాజమాని పున్నం గోపి నూతన వస్త్రాలను అందించారు. మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, మండల చైర్మన్ గుల్ల సూకరాజు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, ఈసీ సభ్యులు డోకల పెద చిన్నారావు, డోకల శ్రీనివాస్, చినమిల్లి రాజేష్ పాల్గొన్నారు.

మద్యం తాగిన వాహన చోదకులకు జరిమానా

భీమడోలు: మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడిన 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసారు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో మద్యం సేవించి వాహనాలను నడుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. భీమడోలు జూనియర్ సివిల్ కోర్టులో బుధవారం నిందితులను హాజరుపర్చగా కోర్టు మేజిస్ట్రేట్ టి.ఆదిత్య రిషిక్ ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై చావా సురేషకుమార్ తెలిపారు.

నేడు పూళ్లలో 'గడపగడపకు'

గణపవరం: గణపవరం మండలంలో ఈనెల 5వ తేదీ గురువారం ఉదయం 9.30 గంటలకు గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తకసంఘ భవనంలో అర్హులకు నూతనంగా మంజూరైన పింఛను పత్రాలను ఎమ్మెల్యే వాసుబాబు అందజేస్తారు. 10.30 గంటలకు గణపవరం మండల గ్రామాల్లో నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల ఆత్మీయ సమావేశంలో వాసుబాబు పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు భీమడోలు మండలం పూళ్ల గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో 111వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమాలకు తప్పక హాజరు కావాలని క్యాంపు కార్యాలయం ప్రతినిధి సుభాష్ కోరారు.

నేడు పెదవేగిలో కొత్త పింఛన్ల పంపిణీ

పెదవేగి : దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తాతా రమ్య చెప్పారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు కొత్తగా మంజూరైన పెన్షన్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆయా పరిధిలోని లబ్ధిదారులను సభకు తీసుకురావాలని ఎంపీపీ సూచించారు.

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఐక్య ఉద్యమం

దెందులూరు: నాగన్నగూడెంలో బుధవారం ఎంఎస్పీ ఆవిర్భావ దినోత్సవాన్ని దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కే.మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జెండాను ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఎంఆర్‌పీఎస్ ఏకైక డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ నాయకులు మద్దాల తిరుపతిరావు, చొదిమెళ్ళ వీరయ్య, సొంగా సోమయ్య, కొండపల్లి రాజేంద్రప్రసాద్, తనగాల రవి, రాజగోపాల్, శ్యాంబాబు, పుల్లయ్య, నిక్కాయేల్‌ఉన్నారు.

పాలిథిన్ కవర్ల స్వాధీనం



భీమడోలులో తోపుడుబండి వ్యాపారి వద్ద నుంచి పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకున్న దృశ్యం

భీమడోలు: పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులపై బుధవారం గ్రామ సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు (మహిళా కానిస్టేబుల్స్) ఆకస్మిక దాడులు నిర్వహించారు. డీపీవో ఆదేశాల మేరకు మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులు తనిఖీలు చేసారు. పాలిథిన్ కవర్లపై నిషేధం ఉందని వ్యాపారులకు వివరించారు. వారి నుంచి పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలో 29 కేజీల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసారు. వాటిన్నింటిని భీమడోలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో భద్రపర్చారు. వాటిని తారు రోడ్ల నిర్మాణంలో వినియోగించేందుకు భద్రపర్చినట్లు ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ తెలిపారు. భీమడోలులో బండ్ల దుకాణదారులు, ఇతర షాపుల్లో పాలిథిన్, ప్లాస్టిక్ వల్లే కలిగే అనర్థాలను చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ వివరించారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

భీమడోలు: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ సేవలు చిరస్మరణీయమని భీమడోలు ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ షంషుద్దీన్ అన్నారు. భీమడోలు భవిత విద్యావనరుల కేంద్రంలో బుధవారం బ్రెయిలీ లిపి ఆవిష్కర్త లూయిస్ బ్రెయిలీ 214వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భవిత టీచర్ రత్నకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా షంషుద్దీన్ హాజరయ్యారు. దాత తేరా అమృతవాణి రాజు ఆర్థిక సాయంతో దివ్యాంగ బాలబాలికలు, తల్లిదండ్రులకు అన్నదానం చేసారు. వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్యా టీచర్ అక్బర్ ఉన్నీసా బేగం, మండల సర్వేయర్ ధర్మారావు, వీఆర్వో మార్కేండేయులు, టీచర్ తేరా అమృతవాణి, వీఆర్ఏలు, దివ్యాంగ చిన్నారులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు లూయిస్ బ్రెయిలీ

గణపవరం: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రయిలీ చిరస్మరణీయుడని, చరిత్ర ఉన్నంతకాలం ఆయన పేరునిలిచే ఉంటుందని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతిని పిప్పర భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేషు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంధులు లూయిస్ బ్రెయిలీ లిపి ద్వారా విద్యనభ్యసించి ఉన్నత స్థానాలను అధిరోహించారని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత బ్రెయి లీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కేక్ కోసి పంచారు. సర్పంచ్ కాకరబేబీ, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, హెచ్‌ఎం ప్రసన్నకుమార్, భవిత ఉపాధ్యాయుడు పి.రాజేంద్రబాబు పాల్గొన్నారు.

భవిత పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ డే

ఉంగుటూరు: ఉంగుటూరు భవిత పాఠశాలలో బుధవారం లూయిస్ బ్రెయిలీ డే నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి భండారు సింధు కేకు కట్‌చేసి పిల్లలకు పంచారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచి పాతూరి జగదీష్, సచివాలయ వెల్ఫేర్ సహాయకురాలు గంగారత్నం, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రాంబాబు, దుర్గారావు, టీచరు రాజు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉంగుటూరు: విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు జోనల్‌చైర్మన్ వంకిన ప్రతాప్ అన్నారు. బుధవారం కాగుపాడులో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శీతాల సత్యనారాయణ, కార్యదర్శి అడపాశోభారాణి, క్లబ్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



బువ్వనపల్లిలో వలంటీర్లు, కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పనితీరు ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమన్వయంతో కృషి చెయ్యాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వైసీపీ శ్రేణులు, వలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ మండలంలో ప్రతి సచివాలయానికి ఇద్దరు ముగ్గురుతో కూడిన 42 సచివాలయ కన్వీనర్లను నియమించామన్నారు. వీరిలో ఇద్దరు పురుషులు, ఒకరు మహిళా కన్వీనర్లు ఉంటారన్నారు. ఆయా సచివాలయ కన్వీనర్లు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఈనెల 20లోపు గృహ సారథులను నియమించుకోవాలని సూచించారు. వలంటీరుకు సమాంతరంగా ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు తీసుకువెళ్లేలా ఈ గృహ సారథులు పనిచెయ్యాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 92 శాతం కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల రూపాల్లో లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని మరలా ఒకసారి ఆ కుటుంబాలకు వివరించేలా ప్రణాళికలో భాగంగా గృహ సారథులను ఎంపిక చేస్తున్నామన్నారు. వీరు స్థానికంగా ఉంటూ ప్రతి 50 కుటుబాలకు పార్టీ ఇచ్చే సందేశాలు చేరవేయడం, వారి అభిప్రాయాలు సేకరించి నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ అదిలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు, వైసీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, వైఎస్ ఎంపీపీ సమయం వీర రాఘవులు, అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గున్నారు.

నేడు పూళ్లలో గడపగడపకూ మన ప్రభుత్వం

భీమడోలు: పూళ్ల గ్రామంలో ఈనెల 5వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని భీమడోలు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ బుధవారం తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని వారు కోరారు.